స్మగ్లింగ్ కింగ్

సుంకరి రాంప్రసాద్

గుజరాత్ లోని కాండ్లా హార్బర్ కు రెండు మైళ్ళ దూరంలో లంగరు వేయబడి ఉంది ఇండియన్ కార్గో షిప్ సముద్రగుప్త.

సింగపూర్ నుండి సరుకులను తీసుకు వస్తున్న ఆ రవాణా నౌక కాండ్లా రేవును సమీపించేసరికి చీకటి పడిపోయింది.

ఆ రాత్రికి ఎలాగూ లోడింగ్, అన్ లోడింగ్ ఉండవు కాబట్టి ఆ షిప్ కు హార్బర్ లోనికి ఎంట్రీ లభించలేదు.

అప్పటినుండి హార్బర్ లోనికి ప్రవేశించడానికి అనుమతి కోసం నిరీక్షిస్తూ అక్కడే ఆగివుంది ఆ నౌక.

రాత్రి పన్నెండు గంటల సమయం. షిప్ లోని సెయిలర్స్ అంతా మత్తుగా నిద్రపోతున్నారు.

నల్లని అరేబియన్ సముద్రజలాల పై తేలుకుంటూ రెండు పడవలు మెల్లగా ఆ షిప్ ను సమీపించ

సాగాయి.

బలిష్టులైన దృఢకాయులు బలంగా తెడ్లు వేస్తూ ఆ పడవలను నడుపుతున్నారు.

నిజానికవి మామూలు కొయ్యపడవలు కావు. మోడరన్ పెట్రోల్ బోట్స్. కాని వాటి ఇంజన్లను ఆన్ చేస్తే వచ్చే శబ్దాన్ని ఆ షిప్‌లోని వారెవరూ పసిగట్టకుండా, వాటి ఇంజన్లను ఆఫ్ చేసి, తెడ్ల సాయంతో ఆ బోట్లను నడుపుకుంటూ ఆ షిప్‌ను చేరుకున్నారు వారు.

అంతవరకూ షిప్ డెక్ మీద పొంచివుండి ఆ బోట్లను గమనిస్తున్న ఇద్దరు సెయిలర్లు లేచినిలబడ్డారు. చుట్టూ ఒకసారి చూశారు. ఎవరూ తమను గమనించటం లేదని నిశ్చయించుకున్నాక ఒకడు చేతిలోని టార్చిలైటును క్రిందకు ఫోకస్ చేశాడు.

రెండు పడవలలోని మనుషులు రెండు బ్యానర్లను ఎత్తిపట్టుకున్నారు. షిప్ మీదనున్న వ్యక్తులకు టార్చిలైటు ఫోకస్‌లో ఆ బ్యానర్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆ బ్యానర్స్‌పైన ఉన్నవి రెండే రెండు అక్షరాలు. అవి.... హెచ్. ఎ.

ఆ అక్షరాలను చూసి షిప్‌లోని సెయిలర్స్ సంతృప్తిగా తలాడించారు.

పడవలోని ఒక వ్యక్తి జేబులోనుండి క్లిప్పులా వున్న పరికరం పైకి తీశాడు. అది చిన్నపిల్లలు ఆటలాడుకొనే వస్తువు.

దానిని ప్రెస్ చేస్తే టిక్....టిక్.... మని శబ్దం వస్తుంది.

దానిద్వారా వస్తున్నది పెద్ద శబ్దం యేమీ కాదు. కాని ఆ నిశ్శబ్ద నిశీథిలో....ఆ చిన్న శబ్దం సైతం డెక్ మీద నిలుచున్న వారికి స్పష్టంగా వినిపిస్తూంది.

టిక్ ... టిక్ ....టిక్ ....

మధ్య మధ్యలో ఆగుతూ....లయబద్ధంగా వినిపిస్తూంది ఆ శబ్దం.

పోస్టాఫీసులలో టెలిగ్రామ్స్‌ను పంపించడానికి ఇలాంటి శబ్దాలనే ఉపయోగిస్తారు. ఒక్కొక్క శబ్దానికి ఇంగ్లీషులో ఒక్కొక్క అక్షరమనే సాంకేతికముంటుంది. దానిని టెలిగ్రాఫిక్ కోడ్ అంటారు.

అలాంటి టెలిగ్రాఫిక్ కోడ్‌లో ఆ బోట్లలోని వ్యక్తులు షిప్ డెక్‌మీద నిలుచున్న వ్యక్తులకు సందేశాన్ని పంపుతున్నారు.

డెక్‌మీద నిలుచున్న ఒక సెయిలర్ జేబులో నుండి చిన్న పాకెట్ డైరీ తీసి శబ్దాలను నోట్ చేయసాగాడు.

అంటే బోట్స్‌లోని వ్యక్తులు పంపుతున్న మెసేజ్ పూర్తయిందన్న మాట.

ఆ శబ్దాలను లెక్కించి, డైరీలో నోట్ చేసిన వ్యక్తి చకచకా ఆ మెసేజ్‌ను డీకోడ్ చేశాడు.

"సీ ద సీ"

"పుష్ ద ఫిష్"

—హెచ్. ఎ.

ఆ మెసేజ్‌ను చదువుకుని సాలోచనగా తలలు పంకించారు ఆ సెయిలర్స్.

ఆ మెసేజ్‌లోని అంతరార్థం వారికి తెలుసు. వారి భాషలో ఫిష్ అంటే స్మగుల్డ్ గూడ్స్.

డెక్ పైన పెద్ద పెద్ద పీపాల చాటున దాచివుంచిన పార్సిల్స్‌ను పైకి తీశారు వారు. ఆ పార్సిల్స్ అన్నీ పెద్ద నైలాన్ త్రాడుతో ముడివేయబడి ఉన్నాయి.

ఆ త్రాడు సాయంతో ఆ పార్సిల్స్‌ను మెల్లగా క్రిందకు జార్చారు వారు. బోట్స్‌లోని వ్యక్తులు చప్పుడు కాకుండా ఆ పార్సిల్స్‌ను అందుకున్నారు.

కేవలం కొద్ది నిముషాలలో గుట్టుచప్పుడు కాకుండా ఆ స్మగుల్డు గూడ్స్ ఎక్స్‌ఛేంజ్ జరిగిపోయింది.

ఇలా కస్టమ్స్ అధికారుల కంటబడకుండా షిప్ సముద్రంలో ఉండగానే తమ సరుకులను రవాణా చేస్తుంటారు స్మగ్లర్స్.

వారు యిచ్చే కరెన్సీ కోసం కక్కుర్తిపడి షిప్ సిబ్బందిలోని కొందరు వారికి ఈ స్మగుల్డు గూడ్స్‌ను చేరవేయటంలో సహాయపడుతుంటారు.

2

కాండ్లా రేవుకు సుమారు ఒకటిన్నర మైళ్ళ దూరంలో నిర్మానుష్యంగా ఉన్న సముద్రతీరాన నిలబడి ఉన్నారు ఇద్దరు వ్యక్తులు.

వారికి కొన్ని గజాల దూరంలో నీలిరంగు స్టాండర్డ్ వాన్ ఒకటి ఆగివుంది.

నల్లని సముద్రపు టొడ్డున తెల్లని కొండల్లాంటి ఇసుక దిబ్బలు తలలు విరబోసుకొన్న భూతాల్లా అక్కడక్కడ గుబురుగా పెరిగిన జీడిచెట్లు.

పట్టపగలు కూడా అక్కడ మానవ సంచారం ఉండదు.

ఆ ఇద్దరు వ్యక్తులూ ఆసహనంగా సముద్రంవైపు చూస్తున్నారు. వారి చేతులలో శక్తివంతమైన టార్చ్

లైట్లు ఉన్నాయి.

అయితే జీడిచెట్ల మాటున కొందరు వ్యక్తులు దాక్కొని, తమ చర్యలను గమనిస్తున్నారన్న సంగతి వారికి తెలియదు.

దాదాపు నలభయి నిముషాల తరువాత వారి నిరీక్షణ ఫలించింది. ముందుగా ఏవో మోటారు బోట్లు వస్తున్న శబ్దం వినిపించింది వారికి.

వారు ఎలర్ట్ అయ్యారు. తమ చేతులలోని టార్చ్ లైట్స్‌ను వెలిగిస్తూ, ఆర్పుతూ ఆ బోట్లలోని వారికి సిగ్నల్స్ పంపారు.

ఆ టార్చ్‌లను వెలిగిస్తూ, ఆర్పటంలో ఒక ప్రత్యేకత ఉంది.

ఒక పద్ధతిలో....ఒక లయలా ...

“వన్ ....వన్ ....టూ ....టూ ....వన్ ....” అంటూ రిథమిక్‌గా వారు ఆ టార్చ్‌తో వెలుగును ఫోకస్ చేశారు.

సముద్రంలోని బోట్లలో నుండి కూడా సరిగ్గా అలాంటి సిగ్నల్స్ వచ్చాయి.

వారు సంతృప్తిగా ఒకరి నొకరు చూసి నవ్వుకున్నారు.

మరపడవలు మెల్లగా ఒడ్డుకు చేరుకున్నాయి. అది....సముద్రగుప్త షిప్ నుండి స్మగ్లుడ్‌గూడ్స్ తెస్తున్న బోట్.

పార్సిల్స్‌ను పదిలంగా తలల కెత్తుకుని మెల్లగా క్రిందకు దిగారు పడవలోని వ్యక్తులు.

ఒడ్డున నిలబడ్డ వ్యక్తులవంక చూసి పలకరింపుగా నవ్వారు వారు.

"అన్నీ వాచీలేనా?"

"ఉహూ .. టూ....ఇన్ వన్‌లు కూడా."

"మరి వి.సి.ఆర్.లు?"

"పదో, పన్నెండో ఉన్నట్లున్నాయి."

వారు మెల్లగా మాట్లాడుకుంటూ సరుకులను వాన్‌లో లోడ్ చేయసాగారు.

బోట్‌లో నుండి పెద్ద రెడ్ పార్సిలొకటి మోసుకు వచ్చాడొక వ్యక్తి. ఒడ్డున నిలబడ్డ వ్యక్తి వంక చూసి సన్నగా నవ్వుతూ అన్నాడు.

"పెరల్స్. మంచి ముత్యాలు."

పార్సిల్స్ అన్నీ వాన్‌లో ఎక్కించేశారు వారు. వాన్‌ను స్టార్టు చేయడానికి తలుపును తెరిచాడు డ్రయివర్.

ఇంతలో బిలబిలమంటూ జీడిచెట్ల చాటునుండి పరుగెత్తుకుంటూ వచ్చారు పదిహేనుమంది వ్యక్తులు. వారి చేతులలో తుపాకులు ఉన్నాయి.

వారి బూట్ల శబ్దం వినగానే....రాతిమీద పడ్డ కుండ పెంకుల్లా నలుదిక్కులా పారిపోయారు ఆ స్మగ్లర్స్.

"పోలీస్....పోలీస్!" అంటూ వారి గొంతులు ఆ జీడితోపులో వికృతంగా ప్రతిధ్వనించాయి.

అందరికంటే ముందుగా వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరుణ్ .... పారిపోబోతున్న డ్రయివర్ మోకాళ్ళపై రివాల్వర్‌తో గురిచూసి కాల్చాడు.

ఒక నిప్పుకణం తాకినట్లు బాధతో విలవిలలాడాడు ఆ డ్రయివర్. కెవ్వున కేక వేస్తూ కుప్పకూలిపోయాడు. వెంటనే యిద్దరు కానిస్టేబుల్స్ అతడిని కదలకుండా బంధించారు.

చాలామంది స్మగ్లర్లు తెలివిగా సముద్రం వైపు పరుగెత్తి ...అక్కడ ఆపివుంచిన తమ మోటార్ బోట్లలో పారిపోయారు.

అయితే.... పోలీసుల కాల్పుల్లో వారిలో కొద్దిమందికి తీవ్రమయిన గాయాలే తగిలాయి.

పోలీసులకు పట్టుబడింది ఆ డ్రయివర్ ఒక్కడే. అయినా, కొన్ని లక్షల రూపాయలు విలువచేసే స్మగుల్డు గూడ్స్ చిక్కాయి.

ముఖ్యంగా ఆ వాన్.

"ఆ వాన్ యెవరిదో తెలుసుకుంటే ఆ ఆధారంతో ఈ స్మగ్లింగ్ గాంగ్ యొక్క మరికొన్ని వివరాలను తెలుసుకోవచ్చు."

ఆ వాన్ వంక సాలోచనగా చూస్తూ అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్ వరుణ్.

ఆ వాన్ నెంబరు జి.ఎ.క. 420.

3

"జి.ఎ.క. 420 నెంబరుగల స్టాండర్డ్ వ్యాన్ మీదే కదూ!"

"యస్ ఇన్‌స్పెక్టర్!"

"అది నీలిరంగు వాన్!"

"అఫ్‌కోర్స్!"

"ఆ వాన్ నిన్న రాత్రి స్మగ్లింగ్ సరకులతో మాకు పట్టుబడింది. దీనికి మీరిచ్చే సంజాయిషీ ఏమిటి?"

"వాన్‌ను వెతికి పట్టుకున్నందుకు కృతజ్ఞాణ్ణి ఇన్‌స్పెక్టర్."

"నేను అడుగుతున్నది సంజాయిషీ."

"కాని నేను చెబుతున్నవి కృతజ్ఞతలు. పోయిన వాన్‌ను వెతికి పట్టుకున్నారు కదా—అందుకు."

అతడివంక నమ్మలేనట్లు చూశాడు ఇన్‌స్పెక్టర్ వరుణ్.

"యస్ మిస్టర్ వరుణ్!

నా వాన్ పోయిందని....ఎవరో దానిని దొంగలించారని నిన్న రాత్రి ఏడుగంటల ప్రాంతంలో నే పోలీస్ రిపోర్టు యిచ్చాను. మీకు వాన్ పట్టుబడింది రాత్రి పన్నెండు తరువాత కదూ!

మీకు సందేహంగా ఉంటే, ఒక్కసారి త్రీ టవున్ పోలీసుస్టేషన్‌లో ఎంక్వయిరీ చేయండి.

అక్కడ నేనిచ్చిన కంప్లైంట్ కాగితం మీకు సాక్ష్యం యిస్తుంది."

ఎర్రబడ్డ ముఖంతో అతడివంక కోపంగా చూశాడు వరుణ్. అది యేమీ చేయలేని ఉక్రోషం.

"మిస్టర్ అలీ...."

"నో....నో....నో....హాసన్ అలీ" ఒక్కొక్క అక్షరానే వత్తి పలుకుతూ అన్నాడతడు.

"ఓకే....మిస్టర్ హాసన్ అలీ. నేరం ఎవరు చేశారో ఈ స్మగ్లింగ్ ముఠానాయకుడు ఎవరో తెలుసుకో నే రోజు త్వరలో నే వస్తుంది. ఆ రోజు....చట్టం ఉక్కు సంకెళ్ళ నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు."

ఇన్‌స్పెక్టర్ వరుణ్ గొంతు ఆ హాలులో కంచులా మ్రోగింది.

వరుణ్ వంక నవ్వుతూ చూశాడు అతడు.

"ఔ దిబె వాన్ కోసం యెప్పుడు రమ్మంటారు ఇన్‌స్పెక్టర్."

విసురుగా వెనుతిరిగి వెళ్ళిపోతున్న ఇన్‌స్పెక్టర్, అతడి మాటలకు టక్కున ఆగాడు.

"అది అంత త్వరగా తేలే వ్యవహారం కాదు మిష్టర్ హాసన్ ఆలీ" అన్నాడతడు కటువుగా.

వరుణ్ వంక కూల్‌గా చూశాడు హాసన్ ఆలీ.

హాసన్ ఆలీ....

కాండ్లా పట్టణానికి మకుటంలేని మహారాజు అతడు. గుజరాత్ రాష్ట్రంలో అతడి పేరు తెలియనివారు లేరు....

అతడి యిల్లు ఒక పెద్ద రాజప్రాసాదంలా ఉంటుంది. ఆ ప్యాలెస్, అందలి ఫర్నిచరూ, ఫర్నిషింగ్సూ అన్నీ కలిసి కొన్ని మిలియన్ల విలువ చేస్తాయి.

పదిహేనేళ్ళ క్రితం....

అతడు కాండ్లా రేవులో పనిచేసుకొనే చిన్న కూలీ అన్న నిజం ఏ ఒకరిద్దరికో తెలుసు.

పదిహేనేళ్ళలో అలాంటి గరీబు ఇంతటి నవాబుగా ఎలా మారగల్గాడు? ఇన్ని కోట్ల రూపాయల ఆస్థిని ఎలా సంపాదించగల్గాడు?

స్మగ్లింగ్ ....!

పేవ్‌మెంట్లమీద ముష్టెత్తుకునేవాడిని ఒక్క రాత్రిలో మహారాజు చేయగల చీకటి వ్యాపారం.

ద ఓన్లీ కింగ్ బిజినెస్ దట్ క్రియేట్స్ కింగ్ ఆఫ్ కింగ్స్.

హాసన్ ఆలీ అలాంటి ఒక కింగ్.

అతడు స్మగ్లర్ అని ప్రజలకు తెలుసు. ప్రభుత్వానికి తెలుసు.

కాని అతడింతవరకూ కనీసం అనుమానంపైన కూడా

అరెస్టు కాబడలేదు.

పచ్చకాగితాల పలుకుబడితో చట్టాన్నీ, అధికారులనూ తన స్వప్రయోజనం కోసం ఎలా వాడుకోవాలో అతడికి బాగా తెలుసు.

అయితే ఇప్పుడతడికి కరుణ్ ఒక సమస్యలా తయారయ్యాడు.

4

సాయంత్రపు నీరెండలో నల్లని తారురోడ్డు తళతళా మెరుస్తోంది. సన్నగా కూనిరాగం తీస్తూ హుషారుగా లారీని నడుపుతున్నాడు చాంద్ రామ్.

దాదాపు నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్డుమీద, జోరుగా, హుషారుగా సాగిపోతోంది అతడి లారీ.

సరుకును అన్ జార్ లో దించేస్తే చాలు, సరుకును దింపినచోటే నాలుగువేలు యిచ్చేస్తారని చెప్పాడు కాండ్లాలో లారీలో సరుకును వేసిన పెద్దమనిషి. వేయి రూపాయలు అడ్వాన్సు కూడా యిచ్చాడతడు.

మొత్తం అయిదువేల కిరాయి. కాండ్లా నుండి అన్ జార్ కు యెవరూ రెండువేలకు మించి కిరాయి యివ్వరు. అలాంటిది ఒక్కసారిగా మూడువేలు యెక్కువంటే మాటలా?

కాకుంటే అతడు చిన్న కోరిక కోరాడు.

సాధారణంగా కాండ్లా నుండి గాంధీగ్రామ్ మీదుగా, అన్ జార్ కు వెళ్తారు. అది మెయిన్ రూట్.

కానీ ఆ పెద్దమనిషి తనను గాంధీగ్రామ్ మీదుగా కాకుండా యింకో రూట్ లో అన్ జార్ కు వెళ్ళమన్నాడు.

అది....కాస్త చుట్టు తిరుగుడు త్రోవ. రోడ్డు

మంచిదే. పక్కా తారువోడ్డు. కాకుంటే ఆ రూట్ అంతా నిర్మానుష్యంగా వుంటుంది.

రోడ్డు కిరువైపులా ఏపుగా పెరిగిన తోటలూ, పొలాలూ, కొండలమీద పరచుకున్న చిక్కని అడవీ, అక్కడక్కడ ఒకటి, రెండు కుగ్రామాలు. అంతే!

నిర్మానుష్యంగా వుండే ఆ రూట్ లో ప్రయాణించడానికి లారీ డ్రయివర్లు ఎవరూ ఇష్టపడరు.

మామూలు బేరమే అయితే చాంద్ రామ్ కూడా చచ్చినా ఆ కిరాయికి ఒప్పుకోనేవాడు కాడు.

కాని, చూస్తూ చూస్తూ మూడు వేల రూపాయలు అదనంగా వస్తుంటే, ఎలా వదులుకోగలడు?

అందుకే.... కాస్త కష్టమయినా ఆ రూట్ లో ప్రయాణించడానికి అంగీకరించాడు అతడు.

అతని మనసులోని ఆలోచనల లాగానే లారీ కూడా శరవేగంగా దూసుకుపోతోంది.

ఇంతలో....

రోడ్డుకు అడ్డంగా వున్న చెక్ పోస్టును చూసేసరికి అతడి ఆలోచనకూ, లారీకీ ఒకేసారి టక్కున బ్రేకులు పడ్డాయి.

అతడు అనుమానంగా చెక్ పోస్టువంక చూశాడు. అతడికి తెలిసినంతలో ఆ రూట్ లో ప్రభుత్వం ఏ చెక్ పోస్టును పెట్టలేదు.

మరి ఇది....?

అతడు వి బుక్, లోడింగ్ డాక్యుమెంట్స్ తీసుకొని క్రిందకు దిగాడు. చెక్ పోస్టు గేటు ప్రక్కనే ఆగివున్న పోలీస్ జీపును చూసేసరికి ఆశ్చర్యంతో అతడి కళ్ళు పెద్దవయ్యాయి.

చెక్ పోస్టు క్లర్క్ స్థానంలో ప్రత్యక్షమయిన ఇన్ స్పెక్టర్ వంక నిర్వీరపోతూ చూశాడతడు.

చాంద్ రామ్ అందించిన సి బుక్ నూ, లారీ చలానా, పే బిల్ వగైరా లోడింగ్ డాక్యుమెంట్స్ ను పరిశీలనగా చూశాడు ఆ ఇన్ స్పెక్టర్.

"అయితే అన్ జార్ వెళ్తున్నావా చాంద్ రామ్?"

"జీ ... సాబ్!"

ఇన్ స్పెక్టర్ చూసి, యిచ్చేస్తున్న కాగితాలను వినయంగా అందుకుంటూ అన్నాడతడు.

"మరి మెయిన్ రోడ్డును వదలి యిలా అడ్డదారులు పట్టావేం?"

అనుమానంగా చూస్తోన్న ఇన్ స్పెక్టర్ వంక సూటిగా చూడలేక తల వాల్చేశాడు చాంద్ రామ్.

"అది ... అది.... దారిలోని గ్రామంలో మా చుట్టాలు వున్నారు సాబ్. వారితో చిన్న కబురు చెప్పాలి. అందుకని...." మెల్లగా నసుగుతూ చెప్పాడతడు.

దారిలో ఎవరైనా అడుగగిలి, ఈ రూట్ లో ఎందుకు వెళ్తున్నావని అడిగితే.... పై విధంగా సమాధానం చెప్పమని చెప్పాడు కాండ్లాలో సరుకును వేసిన పెద్దమనిషి.

అతడి మాటలను తూ.చ. తప్పకుండా యిక్కడ ఇన్ స్పెక్టర్ కు అప్పజెప్పాడు చాంద్ రామ్.

అతడివంక సాలోచనగా చూశాడు ఇన్ స్పెక్టర్. ఇంతలో ముగ్గురు కానిస్టేబిల్స్ వారి దగ్గరకు వచ్చారు.

"లారీ అంతా చెక్ చేశాం సర్. లోపల పళ్ళబుట్టలు తప్ప యింకేమీ లేవు."

వినయంగా సెల్యూట్ చేస్తూ చెప్పాడొక కానిస్టేబుల్.

'ఆ రూట్‌లో నల్లమందు రవాణా అవుతోందని వారికి ఇన్ఫర్మేషన్ వచ్చింది. అప్పటినుండీ అక్కడ కాపు కాసారు వారు.

కాని, గత అయిదారు గంటలుగా ఆ రూట్‌లో వచ్చినది ఆ లారీ ఒక్కటే. తీరా అందులో చెక్ చేస్తే పళ్ళబుట్ట లున్నాయని తేలింది.

అంటే తమకు వచ్చింది రాంగ్ ఇన్ఫర్మేషనా? కాదు. నిజమే అయితే యింకా యెన్ని గంటలు కాపలా కాయాల్సి వుంటుంది?'

అతడు ఆలోచిస్తున్నాడు.

ఇన్స్పెక్టర్‌కు మరోసారి నమస్కరించి మెల్లగా బయటకు నడిచాడు చాంద్ రామ్. అతడిని అనుసరించారు ఆ ముగ్గురు కానిస్టేబుల్లూ.

"ఏం పళ్ళు డ్రయివర్ భాయ్?" ఆశగా అడిగాడు ఒక కానిస్టేబుల్.

'పోలీసు బుద్ధి' అనుకున్నాడు చాంద్‌రామ్. కాని, మనసులోని భావాన్ని పైకి రాకుండా ముఖాన యింత చిరునవ్వు పులుముకొని....

"అంజీర్ భాయి. అత్తిపళ్ళు" అన్నాడతడు.

"అన్‌జార్‌కు అంజీర్లను పంపుతున్న తెలివితక్కువ దద్దమ్మ ఎవరు భాయ్?" అన్నాడొక కానిస్టేబుల్ ఫక్కున నవ్వుతూ. అతడు వాగుడుకాయ.

అతడివంక ఆశ్చర్యంగా చూశాడు చాంద్ రామ్.

"అసలు.... ఆ ఊరికి అన్‌జార్ అన్న పేరు యెలా వచ్చిందంటావ్? అంజీర్లు యెక్కువగా పండుతాయి కాబట్టే. గుజరాత్ రాష్ట్రానికే అత్తిపళ్ళ పంటకు అన్‌జార్ ప్రసిద్ధి. ఇన్నాళ్ళు అన్‌జార్ నుండి యితర

పట్టణాలకు అంజీర్ ఫలాలు ఎగుమతి కావడమే తెలుసు నాకు. కాని, ఈ రోజుకి కాండ్లా నుంచి అంజీర్లు అక్ జార్కు దిగుమతి అవుతున్నాయంటే చిత్రమే మరి"

గడ గడా ఆగకుండా చెప్పుకుపోతున్నాడు ఆ కానిస్టేబుల్.

కానిస్టేబుల్ మాటలకు ఉలిక్కిపడ్డాడు ఇన్స్పెక్టర్.

"నిజమే! ఎగుమతి కావాల్సిన అత్తిపళ్ళు అక్ జార్కు యెందుకు దిగుమతి అవుతున్నట్లు? సంథింగ్ రాంగ్" అనుకున్నాడతడు.

వెంటనే అతడు లారీ దగ్గరకు నడిచాడు.

అతడు చేసైగ చేయగానే రెండు పళ్ళబుట్టలను క్రిందకు దించారు కానిస్టేబుల్స్.

సన్నని వెదురుబుట్టలలో గడ్డి వేసి, వాటి మధ్య నీట్ గా పేర్చబడి వున్నాయి నిగ నిగ లాడుతున్న అత్తి పళ్ళు.

బుట్టలలోని పండ్లను క్రిందకు వంచాడు. జల జల మంటూ క్రిందకు రాలాయి ఆ పళ్ళు. బుట్ట అడుగున గాని, గడ్డి మధ్యగాని యేమీ కనిపించలేదు అతడికి.

అతడు విసుగ్గా లేచి నిలబడ్డాడు.

కానిస్టేబుల్స్ క్రిందపడ్డ అత్తిపళ్ళను బుట్టల్లో నింపుతున్నారు. ఇంతకు క్రితం డ్రయివర్ తో మాట్లాడిన కానిస్టేబుల్ ఒక పండును చేతిలోకి తీసుకున్నాడు' జేబులో నుండి కర్చీఫ్ తీసి శుభ్రంగా ఆ పండును తుడవసాగాడు.

ఇన్స్పెక్టర్ అసహనంగా పచార్లు చేస్తోన్నాడు. అతడిలో యేదో అనుమానం కొట్లాడుతోంది.

"ఆ రూట్‌లో ఆ లారీ రావడం, లేకూడని అత్తి పళ్ళు లేవడం అంతా అసహజత్వమే కనిపిస్తూంది. కాని యెంత వెతికినా అనుమానించేదగ్గదేమీ కనిపించటం లేదు."

కానిస్టేబుల్ మెల్లగా ఆ పండును తినడం ప్రారంభించాడు. రెండు ముక్కలను కొరికి హాయిగా తిన్నాడతడు.

'పుల్ల పుల్లగా, తీయ తీయగా భలే రుచిగా వుందిలే' అనుకున్నాడతడు.

సరిగ్గా మూడవ ముక్కను కొరికే సమయానికి అతడి నాలుకకు సోకింది ఒక విచిత్రమైన రుచి. మామూలుగా, మెత్తగా ఆ పండులో దిగాల్సిన అతడి పళ్ళు యేదో మైనం ముద్దలో ఇరుక్కున్నట్లు బిగువుగా దిగాయి.

అతడు ఆశ్చర్యంగా ఆ పండువంక చూశాడు. లోపల....ఆ పండు గుజ్జు మధ్య యేదో నల్లని ముద్ద కనిపించింది అతడికి.

"సార్!" అంటూ కేక వేస్తూ ఆ పండును తీసుకొని ఇన్‌స్పెక్టర్ దగ్గరకు పరుగెత్తాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ ముద్దవంక పరిశీలనగా చూశాడు. చూసిన మరుక్షణమే అదేమిటో గ్రహించాడు అతడు.

అది....నల్లమందు.

అతడు వెంటనే మిగిలిన పండ్లను పరీక్షించి చూశాడు.

ప్రతి బుట్టలో అడుగున అయిదారు పండ్లలో నల్లమందు వుండలు లభించాయి. అత్తిపళ్ళను జాగ్రత్తగా మధ్యకు కోసి, మధ్య కొంతమేర గుజ్జును తొలగించి, ఆ స్థానంలో నల్లమందు ఉండలను పెట్టి, మళ్ళీ జాగ్రత్తగా

ఆ రెండు ముక్కలను అతికించారు.

పైకి చూడటానికి అవి మామూలు పండ్లలాగానే ఉన్నాయి. ది క్లవరెస్ట్ స్మగ్లింగ్ ఆఫ్ ఓపియమ్.

వెంటనే ఆ సరకును లారీతో సహా సీజ్ చేయించాడు ఆ ఇన్‌స్పెక్టర్.

కోటిరూపాయల పైన విలువ చేసే ఆ నల్లమందును పట్టుకున్నది ఎవరో కాదు.

కాండ్లాలోని దొంగవ్యాపారాలను, అక్రమ రవాణాలను ఎవరు కంట్రోల్ చేశారో!

ఎవరి పేరు చెబితే కాండ్లాలోని స్మగ్లర్ల సింహస్వప్నమో!

ఎవరి పేరు చెబితే కాండ్లాలోని నేరస్థులు గజ గజలాడిపోతారో!

అతడు....ఆ నల్లమందును పట్టుకున్నది.

అతడు....ఇన్ స్పెక్టర్ వరుణ్.

5

అది విశాలమయిన గది. డెకోలం పెయింట్‌తో ఆ గది గోడలు తళతళ లాడుతున్నాయి. ఖరీదయిన, ఎర్రని కాశ్మీర్ కార్పెట్ ఆ గది నేలమీద పరచబడి ఉంది.

గది పైనూరు నుండి వ్రేలాడుతున్న షాండిలర్స్ కాంతి ఆ గదంతా చిక్కగా పరచుకుంది.

రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని విలాసంగా అటూ, యిటూ ఊగుతున్నాడు హాసన్ అలీ. అతని చేతిలో పొగలు క్రక్కుతున్న బంగారు పైపు నుండి విరజిమ్ముతున్న కమ్మని సెంటెడ్ పొగాకు పరిమళం ఆ గదంతా వ్యాపిస్తూంది.

అతడి ఎదురుగా ముగ్గురు వ్యక్తులు కూర్చుని వున్నారు.

వారి చేతులలోని గ్లాసెట్స్‌లో బంగారు రంగు ద్రవం నింపబడి వుంది. వారు నెమ్మదిగా ఆ మద్యం సిప్ చేస్తూ మాట్లాడుకుంటున్నారు.

"అలీ సాబ్! ఇలా అయితే మరి మనం స్మగ్లింగ్ బిజినెస్ చేయలేం."

"గత మూడు నెలలలో సుమారు పదికోట్లు విలువ చేసే మన స్మగ్లింగ్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు."

"ఇదంతా ఆ ఇన్‌స్పెక్టర్ వరుణ్ వలనే. అతడి నిఘా నుండి తప్పించుకోవడం మనకు అసాధ్యమయి పోతోంది."

అంతవరకూ మౌనంగా వారి మాటలను వింటూన్న హాసన్ అలీ మెల్లగా పెదవులను విప్పాడు.

"అందుకే.... నేను స్మగ్లింగ్‌ను ఆపేద్దామనుకుంటు న్నాను."

అతడి మాటలకు ప్రక్కలో బాంబు పడ్డట్లు ఉలిక్కి పడ్డారు వారు.

'స్మగ్లింగ్ కింగ్ హాసన్ అలీ స్మగ్లింగ్‌ను మానేయ డమా? అదీ ఆఫ్టరాల్ ఒక్క మామూలు ఇన్‌స్పెక్టర్‌కు భయపడి!'

ఆశ్చర్యంగా తన వంక చూస్తున్నవారిని చూసి నవ్వాడు హాసన్ అలీ.

"అవును ఫ్రెండ్స్! నిజంగానే ఆపేద్దామనుకుంటు న్నాను—ఒక్క పదిరోజులపాటు."

గుండెలమీద నుండి పెద్ద బండను తొలగించినట్లు తేలిగ్గా నిట్టూర్చారు వారు.

"ఒక్క పదిరోజులపాటు మన స్మగ్లింగ్ కార్య

కలాపాలన్నీ పూర్తిగా కట్టిపెట్టండి. చాలు. ఆ తరువాత మన యిష్టం."

"ఈ పదిరోజులలో యేం జరుగుతుంది అలీ సాబ్!" కుతూహలంగా అడిగాడొక వ్యక్తి.

"మీరే చూస్తారుగా!" నవ్వాడు హాసన్ అలీ.

'ఏం జరగబోతోంది? ఈ పదిరోజులలో హాసన్ అలీ యేం చేయబోతున్నాడు?'

వారందరి మనస్సులలోనూ అదే ప్రశ్న. కానీ అలీ దగ్గర నుండి ఆ ప్రశ్నకు సమాధానం లభించదని వారికి తెలుసు. అతడు చేయబోయేది చెప్పడు.

అలీకి నమస్కరించి ఆ గది నుండి మౌనంగా నిష్క్రమించారు వారు.

రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కు వాలి వున్నాడు అలీ. అతడి మెదడు నిండా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

అతడి ఆలోచన....

ఈ పదిరోజులలో యేం చేయాలన్నదాని గూర్చి కాదు. దాని గూర్చిన ఒక పటిష్టమైన పథకం అతడి దగ్గర సిద్ధంగా వుంది.

అతడి ఆలోచన....

ఇన్‌స్పెక్టర్ వరుణ్ గురించి.

'ఎంతో రహస్యంగా జరిగే తమ స్మగ్లింగ్ కార్య కలాపాల గురించి ఇన్‌స్పెక్టర్ వరుణ్‌కు యెలా తెలుస్తోంది?

సరిగ్గా ఆ సమయానికి, ఆ ప్రదేశంలో అతడు యెలా రెయిడ్ చేయగల్గుతున్నాడు?

ఎవరో అతనికి ఇన్‌ఫర్మేషన్ యిస్తూవుండాలి.

ఎవరు? ఎవరా కల్ప్రిట్?

తమ స్మగ్లింగ్ ముఠాలోని మనిషేనా? అదే నిజమయితే ఆ యింటి దొంగ యెవరో తెలుసుకోవాలి. అంతదరకూ తమ స్మగ్లింగ్ బిజినెస్‌కు రక్షణలేదు.'

ఇప్పుడతని ఆలోచనంతా ఆ అజ్ఞాత వ్యక్తిని గురించే.

6

ఆ రోజు కృష్ణాష్టమి.

కాండ్లా పట్టణంలోని ఆ శ్రీకృష్ణుని మందిరం భక్తితో కళకళ లాడుతోంది.

పచ్చని పందిళ్ళతో, అలంకరింపబడ్డ అరటి స్తంభాలతో, రంగు రంగుల తోరణాలతో ఆ దేవాలయ ప్రాంగణం కన్నుల పండుగ చేస్తోంది.

"మీరా కే ప్రియ్ హృదయ విహారీ....
గోవరధన్ గిరి ధారీ...."

మైకులలో నుండి వాణీజయరామ్ పాడిన మీరా భక్తిగీతాలు శ్రావ్యంగా వినిపిస్తోన్నాయి.

చేతులలో పూజాసజ్జలతో బారులుతీర్చి ఉన్నారు భక్తజనం. అయితే.... దేవాలయాల్లో ప్రవేశించేవారిలో ఉండాల్సిన ప్రశాంతత, భక్తిభావం వారి ముఖాల్లో మచ్చుకయినా కన్పించటంలేదు.

చిరాకులో వారి కనుబొమలు ముడిపడి వున్నాయి. ఏదో దుర్గంధం వస్తున్నట్లు వారు ముక్కులకు కర్చీఫ్‌లను అడ్డం పెట్టుకున్నారు. వారి చూపులు అసహనంగా వున్నాయి.

వారంతా భరించలేనంత అసహ్యంగా చూస్తున్నది ఒకే ఒక ప్రదేశాన్ని.

అది....గుడికి యెదురుగా నున్న పశు మాంస విక్రయ శాలను.

ఆ షాపు క్రొత్తగా ఆ రోజునుండే తెరవబడింది. చర్మం ఒలిచి, వ్రేలాడదీయబడ్డ గో కళేబరాలు ఎర్రగా రక్తపు ముద్దల్లా భయంకరంగా కన్పిస్తున్నాయి. ఓ ప్రక్క చిన్న చెక్కబల్లపై కోయబడ్డ ఆవుల, ఎద్దుల తలలు పేర్చబడి వున్నాయి. పెద్ద వేటకత్తితో ఆ మాంసాన్ని ముక్కలు ముక్కలుగా తరుగుతున్నాడు ఆ షాపులోని ఒక ముస్లిమ్.

అత్యంత జుగుప్సాకరంగా కన్పిస్తున్న ఆ మాంసపు దుకాణం వంక చూడలేక కొందరు భక్తులు బాధగా కళ్ళు మూసుకుంటున్నారు.

"ఇదేమి అన్యాయం? దేవాలయానికి ఎదురుగా గో వధ శాలా?"

"హిందువులు పరమపవిత్రంగా పూజించే గోవులను చంపి, ఆ మాంసాన్ని ఒక హిందూ దేవాలయం యెదురుగా అమ్మతారా? ఎంత కండకావరం?"

"గోవులను ప్రేమించి, పశువులను పాలించిన ఆ గోపాలుని దేవాలయం ముందే గో మాంసాన్ని అమ్ముతున్నారంటే వారెంతకు తెగించారో అర్థం అవుతూంది."

"ఏం తెగింపు. మనకేనా లేనిది? మనం యేమైనా గాజులు తొడిగించుకున్నామా?"

"పదండి....ఈ రోజు అటో యిటో తేలిపోవాలి."

ఎవరు ఈ చర్చను లేవదీసారో, ఎవరు వారిని రెచ్చగొట్టారో, యెవరు ఆవేశంగా ముందుకు కదిలారో యెవరికీ తెలియదు.

కాని, ఒకరి వెనుక ఒకరుగా మూక ఉమ్మడిగా ఒక్కసారిగా ఆ షాపుమీద పడ్డారు వారు.

"దేవాలయం ముందు అలాంటి దుకాణాన్ని పెట్టడం తప్పనీ ... వెంటనే తీసేయామని" ఒక వృద్ధుడు షాపులోని ముస్లింతో సౌమ్యంగా చెబుతున్నాడు.

ఇంతలో...."ఇంకా ఆ కసాయివాడితో మాటలేమి టండీ....పట్టుకొని రెండు తన్నక!" అంటూ యెవరో ఆవేశంగా అరిచారు.

అంతే!

గట్లు తెగిన నదిలా కొందరు షాపులోనికి ప్రవేశించారు ఆ ముస్లింను చావబాదారు కొందరు ఆ మాంసాన్ని కాళ్ళతో తొక్కి, షాపు వెనుక నున్న మురికి కాలువలోకి విసిరిపారేశారు మరి కొందరు.

వారిని వారించాలనీ, అడ్డుకోవాలనీ విఫలప్రయత్నం చేశారు కొందరు భక్తులు. కాని అప్పటికే వారు ఆ దుకాణాన్ని ధ్వంసం చేసేశారు.

'ఈ సంఘటనపై పరిణామా లెలా ఉంటాయో నని' వాపోతూ కొందరు భక్తులు తిరుగుముఖం పట్టారు.

"భగవంతుని దయవల్ల ఇది హిందూ-ముస్లింల మధ్య కొట్లాటకు దారితీయకపోతే చాలు" అనుకొన్నారు మరి కొందరు భక్తులు.

కాని.... వారు భయపడినట్లే ఈ సంఘటనతో దుష్ఫలితాలు ప్రారంభమయ్యాయి.

మారణహోమం ప్రారంభమయింది.

మతం అనే మత్తులో పిశాచాల్లా ప్రవర్తించసాగారు కొందరు విద్రోహులు.

హిందూ దేవాలయాలు కొల్లగొట్టబడ్డాయి. ముస్లింల

మసీదులు కూల్చి వేయబడ్డాయి. దోపిడీలు, గృహ దహనాలూ, హత్యలూ, మానభంగాలూ....

ఒక్కటేమిటి....మత కల్లోలాలతో కాండ్లాపట్టణం అట్టుడికిపోయింది.

ఎప్పుడు, ఎక్కడ లూటీ జరుగుతుందో....

ఎప్పుడు, ఎవరి ప్రాణాలమీదకు వస్తుందో....

ఏ క్షణం ఎలా ఉంటుందోనని కాండ్లా పట్టణప్రజలు తల్లడిల్లిపోసాగారు.

7

హసన్ అలీ ఒక క్రొత్త పథకాన్ని వేశాడు.

అది....స్మగ్లింగ్ కోసం వేయబడ్డ పథకం కాదు. తమ స్మగ్లింగ్ రహస్యాలను పోలీసులకు అందిస్తున్న ఇన్ ఫార్మర్ యెవరో తెలుసుకోడానికి వేయబడ్డ పథకం.

అతడి ముఖ్య అనుచరులు ముగ్గురు.

ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో హసన్ అలీ స్మగ్లింగ్ చేసేదీ ఖచ్చితంగా తెలిసేది ఆ ముగ్గురికి మాత్రమే.

పోలీసులకు తమ రహస్యాలు తెలుస్తున్నాయంటే, ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు పోలీసుల ఇన్ ఫార్మర్ అయి వుండాలి.

ఎవరా వ్యక్తి? అది తెలుసుకోడానికే అతడు వేస్తున్న ఈ ప్లాన్.

హసన్ అలీ తన ముగ్గురు ముఖ్య అనుచరులనూ విడి విడిగా పిలిచాడు.

మరునాడు జరుగబోతున్న తమ స్మగ్లింగ్ వ్యవహారం గురించి వారితో మాట్లాడాడు.

అయితే....ఆ ముగ్గురికీ మూడు వేరు వేరు ప్రదేశాలను చెప్పాడు. ఆ మూడూ ప్రపంచంతో సంబంధం లేని

నిర్జన ప్రదేశాలు.

నిజానికి మరువాడు ఆ ప్రదేశాలలో ఏ స్మగ్లింగూ జరగటం లేదు. ఆ ప్రదేశాలపై రహస్యంగా నిఘా వేసి వుంచమని కొందరు అనుచరులను నియమించాడు అతడు.

అతడి అనుమానం నిజమయితే, ఆ మూడు ప్రదేశాల్లో ఒకదానిపై పోలీసులు దాడి చేస్తారు?

నిర్జనమైన ఆ స్థలంలోనికి పోలీసులు ఎందుకు వస్తారు? వారికేదో ఇన్ ఫర్ మేషన్ అందివుండాలి. ఎవరు చెప్తారు? ఆ ముగ్గురిలో ఒకరు చెప్పాలి.

అంటే.. తన ముగ్గురు అనుచరులలో ఎవరితో....ఆ ప్రదేశంలో స్మగ్లింగ్ జరుగుతూందని చెప్పుడిందో....ఆ అనుచరుడే అసలైన ద్రోహి అన్నమాట.

అదీ హాసన్ అలీ ఆలోచన.

అయితే ...హాసన్ అలీ అనుమానిస్తున్నట్లుగా అతడి ముగ్గురు అనుచరులలో ఏ ఒక్కరు కూడా నమ్మకద్రోహి కారు. పోలీసులకు ఇన్ ఫర్ మేషన్ యిస్తున్నది వారు కాదు ....రీటా!

రీటా ఒక క్లబ్ డాన్సర్.

అలీ ముఖ్య అనుచరులలో ఒకడైన అక్బర్ ఆమె ప్రియుడు.

ఆమె అతడిని మత్తులో ముంచి, తన అందంతో రెచ్చగొట్టి, కోరికతో అతడు సల సల కాగే వేళ.... అతడిని ఊరించి, బుజ్జగించి. అతడిద్వారా ఆ స్మగ్లింగ్ వ్యవహారాలను తెలుసుకొంటోంది.

రీటా అందానికి అక్బర్ బానిస.

అయితే....రీటా తనపై పోలీసులచే ప్రయోగింపబడ్డ

మనిషని అతడికి తెలియదు.

ఆ రోజు రాత్రి కూడా....

మామూలుగా అక్బర్ ద్వారా తెలుసుకున్న స్మగ్లింగ్ ఇన్ ఫర్మేషన్ను ఇన్స్పెక్టర్ వరుణ్కు అందించింది ఆమె.

అయితే....ఇన్స్పెక్టర్ వరుణ్ ఆమె ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ప్రకారం ఆ ప్రదేశానికి వెళ్ళిన మరుక్షణం తన గుట్టు బయటపడుతుందని ఆమెకు తెలియదు.

తనూ, అక్బరు నమ్మకద్రోహులుగా అలీకి తెలిసిపోతుందని ఆమె ఊహించలేదు.

స్మగ్లింగ్ లాంటి చీకటి వ్యాపారాలలో నమ్మక ద్రోహానికి శిక్ష....మరణశిక్ష.

8

మళ్ళీ కల్లోలాలు కార్చిచ్చుల్లా లేచాయి. ఒకసారి అంటుకున్నాక, ఓ పట్టాన ఆరవు. ఎక్కడో ఏ మూలో ఏదో ఒక చిన్న సంఘటన జరుగుతుంది.

తక్షణం దానికి మతం రంగుపులిమి గూండాలు రంగం లోనికి దిగుతారు. కొట్లాట ప్రారంభమవుతుంది.

నగర రక్షణకు పోలీసు బలగాలన్నీ రంగంలోనికి దింపబడ్డాయి. అయినా యెక్కడో, యే మారుమూలో ఒకటి, రెండు చెదురు మొదురు సంఘటనలు జరుగుతూనే వున్నాయి.

ఇన్స్పెక్టర్ వరుణ్కు క్షణం కూడా తీరిక చిక్కడం లేదు. నగరంలో శాంతిభద్రతలను పర్యవేక్షించడంలోనే అతడికి కాలమంతా సరిపోతోంది.

అతడి ఆధ్వర్యంలో పోలీసు దళాలు రాత్రీ, పగలూ భేదం లేకుండా నగరంలో కాపలా తిరుగుతున్నాయి.

స్మగ్లింగ్ వ్యవహారాల గూర్చి ఆలోచించడానికి అతడికి తీరిక లేకుండా పోయింది.

అదీగాక కొన్ని రోజుల నుండి యే ఇన్ ఫర్మేషనూ రావటంలేదు.

కొన్నిరోజుల క్రితం....

అతడికి రీటా వద్ద నుండి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఆమె యిచ్చిన సమాచారం ప్రకారం ఆ రహస్య ప్రదేశానికి పోలీసుబలగంతో వెళ్ళాడు అతడు.

కాని....నిర్మానుష్యంగా, నిర్జనంగా ఉన్న ఆ ప్రదేశం అతడిని వెక్కిరిస్తూ కనిపించింది. రెయిడ్ చేయడానికి వెళ్ళిన పోలీసులు ఫూల్స్‌లా వెనుతిరిగి వచ్చేశారు.

అతడి అనుభవంలో రీటా యిచ్చిన సమాచారం మొదటిసారిగా తప్పయింది. అదే....రీటా దగ్గర నుండి వచ్చిన చివరి సమాచారం కూడా.

సరిగ్గా అప్పటి నుండే రీటా యెవ్వరికీ కనిపించలేదు. విచిత్రంగా అదృశ్యమయింది. ఆమెతోపాటు ఆమె ప్రియుడు అక్బర్ కూడా.

అయితే....మామూలుమైన రీటా గురించి ఇన్వెస్టిగేట్ చేయడానికి పైతం తీరికలేని స్థితిలో వున్నాడు ఇన్స్పెక్టర్ వరుణ్.

ఊబిలో చిక్కుకున్న మనిషిలా ఈ మత కల్లోలాల వలయంలో ఊపిరి కూడా అందక సతమతమవుతున్నాడతడు.

అయితే అతడికి తెలియని నిజం ఒకటుంది. అది రీటా గురించి:

ఏ రోజైతే అతడు రీటా యిచ్చిన సమాచారం

ప్రకారం ఆ రహస్య స్థలంలో రెయిడ్ చేశాడో....

ఆ నోట్

పోలీసులకు తమ స్మగ్లింగ్ రహస్యాలను అందజేస్తున్నది అక్బర్, రీటాలని హాసన్ ఆలీకి తెలిసిపోయింది' అతడి ఎత్తు ఫలించింది.

వెంటనే అక్బర్, రీటాలు బంధించబడ్డారు. ఆ రోజు రాత్రి....

ఆకలిగొన్న మొసళ్ళకు ఆహారంగా వేయబడ్డారు అక్బర్ రీటాలు.

వారి నగ్న దేహాలను కోరలతో కరచి, గుహల లాంటి నోళ్ళు తెరచి, వారి కండరాలను కర కరమని నములుతూ ఆ మొసళ్ళు మింగుతుంటే వారిద్దరూ అనుభవించిన బాధ, నరకం కళ్ళారా చూసిన హాసన్ ఆలీ అనుచరులు....

"పగవాడికి కూడా ఆ నరకయాతన, అంతటి నికృష్టమైన చావు రాకూడదని" అనుకున్నారు.

ఆ భయంకరమైన దృశ్యం చూసిన వారెవరూ భవిష్యత్ లో తమ మూతా రహస్యాలను పోలీసులకు చెప్పే సాహసం చేయలేరు.

హాసన్ ఆలీకి కావలసింది కూడా అదే! అందుకే తన అనుచరులందరి సమక్షంలో.... అక్బర్ రీటాలను అంత క్రూరంగా శిక్షించాడు.

ఇప్పుడతడికి తమ స్మగ్లింగ్ రహస్యాలు పోలీసులకు అందజేయబడతాయనే భయం లేదు.

తనకు కొత్త అడ్డంకి అనుకునే ఇన్ స్పెక్టర్ వరుణ్ మత కల్లోలాలను అదుపు పెట్టటంలో తలమునకలుగా మునిగివున్నాడు.

ఇక.... అతడికి అడ్డేముంది?

మళ్ళీ.... యథావిధిగా, తన స్మగ్లింగ్ కార్యకలాపా లను, స్వేచ్ఛగా కొనసాగించడం ప్రారంభించాడు హాసన్ అలీ.

అయితే అక్బర్ మరణంతో అతడి సమస్య తీరి పోలేదు.

అక్బర్ బతికివున్న రోజులలో తీసుకున్న ఒక నిర్ణయం హాసన్ అలీ పునాదులనే కదిలించివేసింది.

అది.... అక్బర్ వ్రాసిన ఉత్తరం.

అక్బర్ ప్రాణస్నేహితుడు కరమ్‌చంద్. అతడికి ఒక బ్రౌన్ కలర్ కవర్‌ను దాయమని యిచ్చాడు అక్బర్.

ప్రతి ఆదివారం అక్బర్ యే పరిస్థితులలోనైనా కరమ్‌చంద్‌ను కలిసితీరతాడు. ప్రత్యక్షంగా కలిసే అవ కాశం లేకపోతే కనీసం ఫోన్‌లోనైనా మాట్లాడు తాడు. అది వాళ్ళమధ్య ఒప్పందం.

ఆ అలవాటును తప్పే ప్రసక్తే లేదు.

వరుసగా రెండు ఆదివారాలు గనుక అక్బర్ తన మిత్రుడికి కనిపించకపోతే, ఫోన్ కూడా చేయక పోతే అక్బర్‌కు ఏదో ప్రమాదం జరిగిందన్నమాట.

'వెంటనే ఆ బ్రౌన్ కవర్‌ను ఆ కవరుమీద వ్రాయ బడ్డ ఎడ్రస్‌కు పోస్టు చేయమని' తన మిత్రుడు కరమ్ చంద్‌కు చెప్పాడు అక్బర్.

అప్పటికి రెండు వారాలుగా అక్బర్ తనను కాంటాక్ట్ చేయకపోవడంతో, తన మిత్రుని కిచ్చిన వాగ్దానాన్ని సిన్సియర్‌గా పాటించాడు కరమ్‌చంద్.

ఆ కవర్ మీద వ్రాయబడ్డ ఎడ్రస్....

"ఇన్‌స్పెక్టర్ వరుణ్ డి."

9

ఆచార్య సత్యభూషణ్ రంగంలోనికి దిగటంతో కాండ్లా పట్టణ పరిస్థితి చక్కబడింది.

పోలీసుల లాఠీలు చేయలేని పనిని అతని శాంతిప్రవచనాలు సాధించాయి.

కాండ్లాకు నలభయి కిలోమీటర్ల దూరంలో వుంది గాంధీగ్రామ్. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీచే స్థాపించబడింది సేవాగ్రామ్‌గా పిలువబడే ఆ ఆశ్రమం.

ఆ ఆశ్రమ నిర్వాహకుడు ఆచార్య సత్యభూషణ్.

ఏ మతవైషమ్యాలు పూజ్య బాపూజీ ప్రాణాలను సైతం బలి తీసుకున్నాయో... ఆ మత కల్లోలాలతో కాండ్లా పట్టణం రక్తసిక్తమవుతుందని తెలిశాక అతడు చేతులు ముడుచుకుని ఉండలేకపోయాడు.

తన ఆశ్రమవాసులతో కాండ్లా బయలుదేరాడతను.

"ఈశ్వర అల్లా తేరేనాం
సబ్ సంతన్ కో కరే ప్రణామ్!
ఏసుక్రీస్తు అతి పావన నాం
సబ్ కో సన్మతి దే భగవాన్!
రఘుపతి రాఘవ రాజారామ్
పతిత పావన సీతారామ్!"

జాతిని చైతన్యవంతం చేసిన ఆ గాంధీజీ ప్రవచనాన్ని భక్తిపూరిత గళాలతో గానం చేస్తూ.... కాండ్లా పుర వీధులలో శిష్యులతో సహా పాదయాత్ర చేశాడు అతడు.

"భగవంతుడు ఒకడేనని. సర్వ మతములు ఆ భగవత్ సాన్నిధ్యాన్ని చేరడం కోసం ఏర్పరచబడ్డ రహదారులేనని."

ప్రజలకు బోధ చేస్తూ మతవైమనస్యాలను విడనాడమని వారికి విజ్ఞప్తి చేశాడు.

అతని ఆధ్వర్యంలో హిందూ దేవాలయాలను ముస్లింలు, మహమ్మదీయుల మసీదులను హిందువులు మరమ్మత్తులు చేశారు. కలసికట్టుగా పని చేశారు.

"హిందూ.... ముస్లిమ్ భాయి భాయి" అన్న నినాదాలతో కాండ్లా పట్టణం మారుమ్రోగిపోయింది.

అలా అర్థాంతరంగా మత కలహాలు ఆగిపోవటంతో గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది హాసన్ అలీకి.

ఈ క్రొత్త అవరోధాన్ని ఎలా తొలగించుకోవాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడతను.

అతడి దృష్టి యిప్పుడు ఆచార్య సత్యభూషణ్ పైన వుంది.

10

'అంత సఖ్యంగా సమైక్యంగా కలసి మెలసి ఒకరికొకరు సహకరించుకుంటున్న హిందూ, ముస్లింల మధ్య కొట్లాటలు ఎలా ప్రారంభమయ్యాయో!" ఇన్ స్పెక్టర్ వరుణ్ కు అర్థం కాలేదు.

అతడిప్పుడు క్రొత్త ఆలోచనలో పడ్డాడు.

'అంటే ఇవి సహజంగా యేర్పడ్డ కొట్లాటలు కావా? యెవరో తమ స్వార్థంకోసం ఈ మత కల్లోలాలను లేపివుంటారా?

ఎవరు ఎవరై వుంటారు?'

ఈ మధ్య స్మగ్లింగ్ వ్యవహారాలు ముమ్మరమయాయని అతడికి నమ్మకంగా తెలిసింది.

మతకల్లోలాలు ప్రారంభం కాకముందు కాండ్లాలో

స్మగ్లింగ్ వ్యవహారాలను తొంభయి శాతం వరకూ అతడు అరికట్టగలిగాడు.

'మళ్ళీ యిప్పుడు స్మగ్లింగ్ పుంజుకుందంటే....

కేవలం అతని దృష్టిని మరల్చడానికి, తను ఈ మత కల్లోలాలను అణచడంలో నిమగ్నుడయి ఉండగా.... తమ స్మగ్లింగ్ వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి ఎవరో దుర్మార్గులు పన్నిన పన్నాగమా ఇది?

తన అనుమానమే నిజమయితే ఈ దుర్మార్గంలో ముఖ్య హస్తం హాసన్ అలీది అయివుంటుంది.'

సాలోచనగా తలను పంకించాడు వరుణ్.

"హాసన్ అలీ....ఇందరు అమాయకుల మానప్రాణా లను బలి తీసుకున్న నిన్ను మాత్రం నేను విడిచి పెట్టను...." ఉద్రేకంగా అనుకున్నాడతడు.

అదే సమయంలో కరమ్‌చంద్ ద్వారా పోస్టు చేయ బడ్డ అక్బర్ వ్రాసిన ఉత్తరం అతడికి అందింది.

అతడు ఆత్రంగా ఆ కవర్‌ను తెరచి ఉత్తరాన్ని పైకి తీశాడు.

లేత గులాబిరంగు లేపర్ కాగితాల పై ఎడంచేతి వైపు అక్బర్ .. పేరూ, అడ్రస్ ముద్రింపబడి ఉన్నాయి.

అతడు ఉత్తరం చదవటం ప్రారంభించాడు:

ఇన్‌స్పెక్టర్ వరుణ్ గారికి,

పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో వ్రాసిన 'ఇఫ్ ఐ యామ్ ఎసేసినేటెడ్' అన్న ఆత్మకథను చదివాక.... నా కెందుకో ఇలాంటి ఉత్తరం వ్రాయాలనిపించింది.

అడుగడుగునా ప్రమాదాలు పాముల్లా పొంచి

ఉండే వృత్తి మాది. ఎప్పుడు చావు వస్తుందో చెప్పలేని బ్రతుకు మాది.

ఏ క్షణం పోలీసులకు పట్టుబడిపోతామో! ఏ ముఠా తగాదాలలో శత్రువర్గాల తుపాకీ గుళ్ళకు ప్రాణాలు కోల్పోతామో! మాకే తెలియని స్థితి....

ఒక్కొక్కసారి, మామీద నమ్మకం నశించిన మా నాయకుడే మమ్మల్ని మొసళ్ళకు ఆహారంగా వేసినా వేయవచ్చు!

దిన దిన గండం నూరేళ్ళాయుష్షు అంటారే. అలా వుంటాయి మా జీవితాలు.

'ఒక వేళ, ఏ దురదృష్ట క్షణాన్నయినా నేను అర్ధాంతరంగా మరణిస్తే, లేదా మా నాయకుడే నన్ను చంపేస్తే....' అన్న ఊహే ఈ ఉత్తరానికి ప్రేరేపణ.

నా నూరేళ్ళ జీవితం అలా అకస్మాత్తుగా అంతరించిపోతే నాతో పాటుగా నాలోని రహస్యాలన్నీ ఎందుకు అంతరించి పోవాలి?

నేనొక్కడిని మాత్రమే బ్రతుకుకు దూరమై, మా నాయకుడు, నా తోటి సహచరులు అంతా హాయిగా ఎందుకు బ్రతకాలి?

వారు మాత్రం ఎందుకు సుఖపడాలి?

అందుకే మా నేరాలను. మా రహస్యాలను, బట్టబయలు చేస్తున్నాను.

మా ముఠాలోని వ్యక్తుల పేర్లు, వారి ఎడ్రస్ లతో సహా యిక్కడ వ్రాస్తున్నాను. మా స్థావరాల చిరునామాలు టెలిఫోన్ నెంబర్లతో సహా

యిక్కడ పొందుపరుస్తున్నాను.

మా స్మగ్లింగ్ కోడ్స్, మా ఆచార, వ్యవహారాలూ, మేము తిరిగే ప్రదేశాలూ, మా సరకులు దాయబడే గోడౌన్లూ....అన్నింటి వివరాలూ ఈ ఉత్తరంలో వ్రాయబడ్డాయి.

నాతో పాటుగా, ఈ స్మగ్లింగ్ రాకెట్ అంతా నాశనమవ్వాలన్నది నా కోరిక.

నే నొక స్వార్థపరునిలాగానో, సాడిస్టులాగానో మీకు కనిపించవచ్చు.

నినే లేకపోయాక, ఈ నీతి నియమాలతో నాకు పనేమిటి? నా పిచ్చి నాకు ఆనందం.

నాతో పాటుగా నా ముఠా కూడా అంతరించబోతున్నదన్న ఆత్మతృప్తి కోసం ... ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను.

ఇది యెవరికి ఎడ్రస్ చేయాలా అని చాలా రోజులు ఆలోచించాను.

ఇంతలో మీరు కనిపించారు.

హసన్ అలీ....ఐ మీన్ మా బాస్. ఎర చూపించిన ధనానికి, అతడి పలుకుబడికి లొంగని నిజాయితీగల పోలీస్ ఆఫీసరు మీరు.

మీరే ఈ ఉత్తరాన్ని అందుకొని, దీనికి న్యాయం చేకూర్చగల సమర్థులు. ఆ నమ్మకంతోనే మీకీ ఉత్తరం అందే ఏర్పాటు చేస్తున్నాను.

ఇఫ్ ఐ యామ్ ఎసేనీ నేబెడ్

"అక్బర్".

ఆ ఉత్తరాన్నీ, అందులో వ్రాయబడ్డ స్మగ్లర్ల వివ

రాలనూ చదువుతోన్న ఇన్‌స్పెక్టర్ కళ్ళు విచిత్రంగా మెరిసాయి.

"థాంక్స్! థాంక్స్ సోమచ్ అక్బర్" అనుకున్నాడతడు ఆనందంగా ఆ ఉత్తరాన్ని గుండెలకు హత్తుకుంటూ.

11

హాసన్ అలీ ఊడలు విస్తరించుకున్న విశాలమైన వట వృక్షం లాంటివాడు.

ఊడలను నరకకుండా మర్రిచెట్టును ఎలా కూల్చలేమో అతడి అనుచరులందరినీ అతడికి దూరం చేయకుండా హాసన్ అలీని కూడా యేమీ చేయలేం.

ఆ నిజం ఇన్‌స్పెక్టర్ వరుణ్‌కి బాగా తెలుసు.

అందుకే తన దగ్గరున్న, అక్బర్ ఉత్తరం సహాయంతో హాసన్ అలీ అనుచరులను ఒక్కొక్కరినీ చాప క్రింద నీరులా చుట్టుముట్టాడు అతడు.

పోలీస్ కమెండో దళం రింగంలోనికి దింపబడింది.

ఒక అద్భుతమైన వ్యూహంతో.... వారి రహస్య స్థావరాలూ, వారి స్మగ్లింగ్ గోడౌన్స్ అన్నీ ఒక్కరాత్రిలో ముట్టడించబడ్డాయి.

కమెండోదళాలు చేసిన మెరుపు దాడుల్లో హాసన్ అలీ అనుచరులంతా పోలీసుల చేతికి చిక్కారు.

అత్యంత రహస్యంగా ఈ దాడులన్నీ నిర్వహింపబడ్డాయి. చివరకు హాసన్ అలీకి కూడా అనుమానం రానంత రహస్యంగా.

ఇక మిగిలింది హాసన్ అలీ, అతడి ముఖ్య అనుచరులు యిద్దరూ అంతే!

అయితే మిగిలిన అనుచరులులా హాసన్ అలీపై రెయిడ్ చేయడం అంత సులువైన పనేమీ కాదు.

అతనిని నేరస్తునిగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకొంటే గాని, చట్టరీత్యా అతడిని శిక్షించడం సాధ్యం కాదు. సంఘంలో అతడికున్న హోదా, పలుకుబడి అలాంటివి.

కాని ఎలా?

ఇన్‌స్పెక్టర్ వరుణ్‌ను వేధిస్తున్న ముఖ్య సమస్య అదే!

హాసన్ ఆలీ యొక్క అతి ముఖ్యమైన స్థావరాన్ని సెర్చ్ చేస్తుండగా లభించిన ఒక అతిముఖ్య సమాచారం.... అతనిని వేధిస్తున్న సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపించింది.

ఆ క్షణమే.... ఇన్‌స్పెక్టర్ మెదడులో ఒక అద్భుతమైన వ్యూహం రూపుదిద్దుకొంది.

"యూ ఆర్ ఫినిష్డ్ హాసన్ ఆలీ!" అనుకున్నాడతడు ఆనందంగా.

12

తెల్లవారుఝాము నాలుగుగంటల వేళ.

సన్నగా కురుస్తోన్న పొగమంచులో కాండ్లా వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. నగరం యింకా నిద్ర లేవలేదు.

అందమైన ఇంపాలా కారొకటి బాణంలా దూసుకొని వచ్చి ఒక సందు మొదలులో ఆగింది. కారు డోర్ తెరుచుకొని హాసన్ ఆలీ క్రిందకు దిగాడు. అతడి వెనుకే అతడి ముఖ్య అనుచరు లిద్దరూ రెండు బరువైన సూట్‌కేస్‌లతో క్రిందకు దిగారు.

వారు ముగ్గురూ చకచకా నడుచుకుంటూ ఆ ఇరుకు సందులోని ఒక చిన్న పెంకుటిల్లు ముందు ఆగారు.

కాండ్లా రేవులో కూలీనాలీ చేసుకొని జీవించే అలగా

జనం ఉండే వీధి అది.

హసన్ అలీ లాంటి ఖరీదయిన మనుషులు ఆ వీధిలోకి అడుగు పెట్టడం యెవరికైనా అనుమానం కలిగిస్తుంది. కాని, అలగా జనంగా చలామణీ అయ్యే ఆ రేవు కూలీ అంతా హసన్ అలీ అనుచరులే.

అందుకే అతడంత నిస్సంకోచంగా ఆ వీధిలోనికి అడుగు పెట్టగలిగాడు.

ఆ యింటి తలుపులు మూసివున్నాయి. మునివ్రేళ్ళతో టక టప మంటూ మెల్లగా ఆ తలుపులపై తట్టాడొక అనుచరుడు.

వెంటనే ఆ తలుపులు తెరచుకున్నాయి. అలీకి, అతని వెనుకనున్న యిద్దరు అనుచరులకూ వంగి సలామ్ చేశాడు తలుపులు తెరచిన వ్యక్తి.

అలీ హుందాగా నడుచుకుంటూ లోపలకు పోయాడు. అతనిని వెన్నంటారు అతని అనుచరులు.

అది పైకి చూడటానికి చిన్న పెంకుటిల్లులా వున్నా లోపల చాలా విశాలంగా వుంది. నాలుగయిదు చిన్న చిన్న గదులున్నాయి అందులో.

వారు ఒక గదిలోనికి ప్రవేశించారు.

"వారు ఈపాటికి హోటల్ నుండి బయలుదేరి వుంటారు బాస్!" అన్నాడొక అనుచరుడు.

ఔనన్నట్లు మెల్లగా తలాడించాడు అలీ....ఆ గది లోని ఒక కుషన్డ్ ఛెయిర్‌లో రిలాక్సవుతూ.

"మరి సత్యభూషణ్ విషయం యేం చేశారు బాస్?" అన్నాడు యింకొక అనుచరుడు.

"సత్యభూషణ్ రేపు చనిపోబోతున్నాడు."

"బా....స్?"

ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టిన వారివంక చూశాడు అలీ.

"స్వాతంత్ర్యం వచ్చాక, ఇండియా, పాకిస్తాన్‌ల విభజన జరిగిన తొలిరోజులలో ఇలాగే హిందూ, ముస్లింల మధ్య మతకల్లోలాలు చెలరేగాయి.

వాటిని అరికట్టడానికి విశ్వప్రయత్నం చేశాడు గాంధి. ఏమయ్యాడతను? గాడ్సేచే కాల్చి చంపబడ్డాడు. సత్యభూషణ్ కూడా అంతే!

రేపు సాయంత్రం పబ్లిక్ గ్రౌండ్స్‌లో బ్రహ్మాండమయిన బహిరంగసభ జరగబోతుంది. ఆచార్య సత్యభూషణ్....హిందూ, ముస్లింల సమైక్యత గురించి అక్కడ ఉపన్యసించబోతున్నాడు.

సభ జరుగుతూ వుండగా ప్రేక్షకుల మధ్య కూర్చున్న మన అనుచరులు చిన్న గలాటా సృష్టిస్తారు. అందరి దృష్టిని వారివంకకు మళ్ళించుకుంటారు.

అదే సమయంలో....

మరో దిక్కునుండి సైలెన్సర్ అమర్చిన రివాల్వర్‌తో సిద్ధంగావున్న మన అనుచరుడు ఆచార్య సత్యభూషణ్‌ను కాల్చి చంపుతాడు.

హాహాకారాలతో ప్రజలంతా గగ్గోలెత్తే సమయంలో మన అనుచరులు చల్లగా ఆ ప్రదేశం నుండి బయటకు జారుకుంటారు.

ఆచార్యులను హత్య చేసింది ఒక ముస్లిం అన్న గాలి వార్తను మెల్లగా ప్రజలలోనికి ప్రచారం చేస్తాం.

ఇక....అరిపోబోతోన్న నిప్పు రాజుకుంటుంది. మళ్ళీ మతకలహాలు మొదలవుతాయి.

ప్రజలూ, పోలీసులూ ఆ మతకలహాలలో కొట్టుకు

పోతూంటే... మనమట్టుకు మనం హాయిగా, ప్రశాంతంగా మన స్మగ్లింగ్ వ్యవహారాలను చక్కబెట్టుకుంటాం!"

ఆలీ మాటలు వింటూ అతడి వంక ఆరాధనగా చూశారు అతడి ఇద్దరు అనుచరులూ.

వారు యిలా మాట్లాడుకొంటూ ఉన్న సమయంలో....

ఆ సందు మొదలులో మరో టాక్సీ ఆగింది. అందులో నుండి ఇద్దరు అరబ్ షేక్‌లు క్రిందకు దిగారు. నేరుగా ఆ పెంకుటింటి ముందుకు వచ్చి, మునివేళ్ళతో తలుపుపై శబ్దం చేశారు.

ఓరగా తలుపులను తెరచిన అనుచరుడికి ఒక విజిటింగ్ కార్డు నిచ్చారు వారు.

అది మామూలు విజిటింగ్ కార్డు కాదు. తెల్లని వెండి బిళ్ళ మీద హాసన్ ఆలీ అన్న బంగారు అక్షరాలు పూత పూయబడి వున్నాయి.

ఆ విజిటింగ్ కార్డు వంక సంతృప్తిగా చూశాడు ఆ అనుచరుడు.

తనను ఆ రహస్యస్థలంలో కలుసుకోబోయే వారికి హాసన్ ఆలీ యిచ్చే విజిటింగ్ కార్డు అది. ఆ యింటిలోకి క్రొత్తవారు ప్రవేశించడానికి అనుమతి పత్రంలాంటిది అది.

ఆ అరబ్ షేక్‌లను తీసుకొని అతడు హాసన్ ఆలీ వున్న గదివైపు నడిచాడు. వారిని గదిలోనికి సాదరంగా ఆహ్వానించాడు ఆలీ.

వారు తాము తెచ్చిన సూట్ కేసులను తెరచి ఆలీ ముందు ఉంచారు. పచ్చని బంగారు బిస్కట్లు మిల మిల మెరుస్తూ ఆలీ కన్నులను చెదరగొట్టాయి.

ఆ బంగారం వంక నవ్వుతూ చూశాడతడు.

అతడు చేసైగ చేయగానే అతడి అనుచరులిద్దరూ తమదగ్గరున్న రెండు సూట్ కేస్‌లనూ తెరచి ఆ షేక్‌ల ముందు పెట్టారు.

"పవావర్ సామిన్న ఫరమ్ నుండి ఉత్పత్తి అయిన అసలు సిసలైన హెరాయిన్ ....ఇది...."

ఆ సూట్ కేస్‌లలో నీట్ గా పేర్చబడ్డ హెరాయిన్ పేకట్లవంక గర్వంగా చూస్తూ అన్నాడు అలీ.

ఆ షేక్‌లు అతడివంక మెచ్చుకోలుగా చూశారు. ఆ సూట్ కేసులను క్లోజ్ చేసి చేతులలోనికి తీసుకున్నారు.

"ఓకే అలీసాబ్! వస్తాం. వచ్చేనెల మళ్ళీ మేం వచ్చేసరికి సరుకు సిద్ధంగా ఉంచండి" అన్నాడొక షేక్ అలీతో కరచాలనం చేస్తూ.

వారు ముందుకు అడుగు వేశారు. వారికి వీడ్కోలు నివ్వడానికి అలీ కూడా ముందుకు నడిచాడు.

అంతలో....

మూసివున్న తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. చేతిలో రివాల్వర్ తో కాల యముడిలా ఆ గదిలోనికి ప్రవేశించాడు ఇన్‌స్పెక్టర్ వరుణ్.

అతని వెనుకే బిల బిలమంటూ నలుగురు పోలీసు ఆఫీసర్లు ఆ గదిలోనికి చొచ్చుకొని వచ్చారు. వారి చేతులలో రివాల్వర్స్ ఆ గదిలోనివారికి గురి పెట్టబడి వున్నాయి.

ఈ హఠాత్పరిణామానికి హసన్ అలీతో సహా ఆ గదిలోని వారంతా తెల్లబోయారు.

"ఇక నీవు తప్పించుకోలేవు అలీ. ఐయామ్ సారీ

హాసన్ ....అలీ కదూ!"

ఇన్స్పెక్టర్ వంక హేళనగా చూస్తూ నవ్వాడు అలీ.

"కోర్టులో నా నేరాన్ని నిరూపించగలవా మిస్టర్ వరుణ్? ఈ స్మగ్లింగ్ గూడ్స్ అన్నింటినీ యెక్కడో సీజ్ చేసి, నామీద వ్యక్తిగతమైన కక్షతో నామీద ఈ నేరాన్ని మోపారంటాను. అప్పుడు యే సాక్ష్యంతో నన్ను దోషిగా నిలబెడతారు?"

"నాకు తెలుసు అలీ. నీవు అంత మేధావివే. కాని, నీకు తెలియని నిజాలు కొన్ని విను:

ఈ గదిలో మీరు మాట్లాడుకున్నదంతా టేప్ రికార్డర్ లో రికార్డు చేయబడింది.

ఈ గదిపైన గల వెంటిలేటర్ ద్వారా మీ రీ గదిలో ప్రవేశించినప్పటి నుండీ జరిగిన వ్యవహారం అంతా వీడియో కమేరాతో షూట్ చేయబడింది.

ఇక ప్రక్కగదిలో కూర్చుని, నీ అసలు స్వరూపాన్ని స్వయంగా చూసిన ఆ ముగ్గురు వ్యక్తులవంకా ఒక్కసారి చూడు."

గుమ్మం పైపు తర్జని చూపిస్తూ అన్నాడు వరుణ్.

గుమ్మంవద్ద నిలబడిన కాండానగర్ మేయర్, మేజిస్ట్రేట్, కమీషనర్ ఆఫ్ పోలీసులను, వారి వెనుక వీడియో కమేరా, టేప్ రికార్డర్ లు పట్టుకొని నిలబడ్డ పోలీసు ఆఫీసర్లను చూసేసరికి నిశ్చేష్టుడై పోయాడు అలీ.

"నీ స్థావరాలూ, గోడౌన్లూ అన్నీ మా స్వాధీనంలోకి

వచ్చాయి. నీ అనుచరులంతా అరెస్టు చేయబడ్డారు. నీ కోసం నీ ప్రాకారంలో నే మాటు వేశాం.

ఈ క్షణం నీవు ఏకాకివి.

యూ ఆర్ ఫినిష్డ్ అలీ!"

వరుణ్ గొంతు కఠినంగా పలికింది.

అయితే హాసన్ అలీ పంచేంద్రియాలు అప్పటికే పని చేయడం మానేశాయి.

—:అ యి పో యి ం ది:—